వ్యాధుల కారకాలుగా ఖాళీ స్థలాలు

- పిచ్చి మొక్కలు పెరిగి వర్షంనీటి నిల్వ
- భరించలేని దుర్వాసన
- విష పురుగుల సంచారం
- దోమల వ్యాప్తితో స్థానికుల ఆందోళన

పట్టణంలోని ఖాళీ స్థలాలు విష పురుగులకు ఆవాసాలుగా మారాయి. ఏపుగా పిచ్చిచెట్లు, ముళ్లపొదలు పెరగడంతో చిట్టడవిని తలపిస్తున్నాయి. వర్షం నీరు నిల్వ ఉండి దుర్వాసనతోపాటు దోమలు వ్యాప్తి అధికం కావడంతో వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పాములు, విష పురుగులు అధికమై ఇంటి పరిసరాల్లోకి వస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన పిచ్చిచెట్లు, ముళ్ల పొదలు

నూజివీడు: నూజివీడు పట్టణంలో సుమారు 500 వరకు ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటి యజమానులు దూర ప్రాంతాల్లోనూ, నగరాల్లోనూ నివాసం ఉంటూ వారి స్థలాలను గాలికొదిలేయడంతో వాటిల్లో ముళ్లపొదలు, పిచ్చి చెట్లు దట్టంగా పెరిగాయి. ఎంప్లాయీస్ కాలనీ, అమ్మవారి తోట, బంగినపల్లి తోట, కృష్ణా విలాస్ నగర్, ఉషాబాలా నగర్, ఎమ్మార్ అప్పారావు కాలనీ తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి. చీకటి పడితే ఆయా ప్రాంతాల వారు ఆందోళన చెందుతున్నారు. ఎటు వైపు నుంచి పాములు, విష పురుగులు వస్తాయోనని భయాందోళనలకు గురవుతున్నారు. ఎంప్లాయీస్ కాలనీలోని పార్కులోకి ఇటీవల తాచుపాము రావడంతో వాకర్స్ ఆందోళన చెందుతున్నారు. ఖాళీ స్థలాల్లో వర్షం నీరు, మురుగు నీరు నిలిచి ఉండటంతో పందులకు ఆవాసాలుగా మారాయి. వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల ఇళ్లను ఆనుకునే ముళ్లపొదలు ఉండటంతో ఎప్పుడు ఏ ముప్పు వాటిల్లుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నోటీసులు ఇవ్వని మున్సిపాలిటీ

ఖాళీ స్థలాలను గాలికొదిలేయడంతో దాని చుట్టు పక్కల నివసిస్తున్న గృహాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయకుండా తాత్సారం చేస్తున్నారు. ఖాళీ స్థలాల్లో ముళ్ల చెట్లు పెరగకుండా, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాల్సిన బాధ్యత ఆయా స్థలాల యజమానులదే. వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తుండటంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముళ్ల పొదలను తొలగించాలి



ఇళ్ల సమీపంలోని ఖాళీ స్థలాల్లో ముళ్ల పొదలను తొలగించాలి. ఈ స్థలాల్లో ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో విష పురుగులకు ఆవాసంగా మారాయి. అపరిశుభ్రత నెలకొనడంతో దోమలు వ్యాపించి వ్యాధుల బారిన పడుతున్నాం.

– కంచర్ల లవకుమార్
మాజీ కౌన్సిలర్, నూజివీడు

పట్టించుకోవడం లేదు



ఖాళీ స్థలాల యజమానులు ఎక్కడెక్కడో దూర ప్రాంతాల్లో నివాసముంటూ ఖాళీ స్థలాలను గాలికొదిలేస్తున్నారు. దీంతో ఖాళీ స్థలాలు మురుగు నీటి తటాకాలుగా మారి దోమల ఉధృతికి కారణమవుతున్నాయి. వర్షం నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. పాటు వ్యాధుల బారిన పడుతున్నాం.

– సయ్యద్ మూసా, నూజివీడు

క్లుప్తంగా

రహదారి గండి పూడ్చివేత



లక్ష్మీపురం(తిరువూరురూరల్): మండలంలోని లక్ష్మీపురం శివారు కొత్త లక్ష్మీపురం వద్ద రహదారికి ఇటీవల కురిసిన వర్షాలతో పడిన గండిని సర్పంచి గొల్లమండల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్మికులు గురువారం పూడ్చారు. ఈ రహదారిపై వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నందున అత్యవసరంగా మరమ్మతులు చేయించామని సర్పంచి తెలిపారు. గ్రామంలో పలు రహదారులకు కూడా మరమ్మతులు చేయిస్తామన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో సాగు మేలు



ఎ.కొండూరు: సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని పత్తి సాగుచేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని జాతీయ పత్తి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ భాగ్యలక్ష్మి అన్నారు. చీమలపాడులో డాక్టర్ కేఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం, గరికపాడు శాస్త్రవేత్తలతో కలిసి గురువారం పత్తి పొలాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. సాగులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ఈ ప్రాంత రైతులందరికి అవగాహన కల్పించి పొలాల్లో ప్రదర్శన నిర్వహిస్తున్నామని చెప్పారు. గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. రాజశేఖర్, జి. శోభితారాణి పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించాలని ఆందోళన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానికులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం. మహేష్ మాట్లాడుతూ కొద్దిపాటి వర్షానికే కాలనీలోని రోడ్లు చిత్తడిగా మారి నడిచేందుకు కూడా వీలులేకుండా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బుడమేరు వరదతో కాలనీ పూర్తిగా నీటిముంపునకు గురైందన్నారు. ప్రభుత్వ పరిహారం కొందరికే అందిందని చెప్పారు. మిగిలిన వారికి కూడా తక్షణమే చెల్లించాలని, కాలనీలో తాగునీటి సదుపాయం, రోడ్ల అభివృద్ధి, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాలనీ వాసులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వేణుగోపాలుని కల్యాణం



నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారి మాస కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. రుక్మిణీదేవి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చక బృందం శాస్త్రోక్తంగా జరిపారు. ఎనిమిది మంది దంపతులు పీటలపై కూర్చుని కన్యాదానం చేశారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

కనులవిందుగా నందా దీపోత్సవం



గంపలగూడెం: గంపలగూడెం షిర్డీ సాయి ధ్యాన మందిరంలో గురువారం రాత్రి పౌర్ణమి సందర్భంగా నందా దీపోత్సవం కనులవిందుగా నిర్వహించారు. బాబా చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి మందిరం చుట్టూ 11 ప్రదర్శనలు చేశారు. మహిళలు నందా దీపాలను చేబూని పల్లకి వెంట ప్రదక్షిణలు చేశారు. అనంతరం షిర్డీ సాయి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీఆర్వోలతో సమీక్ష

వీరులపాడు: వీఆర్వోలు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని తహసీల్దార్ హుస్సేన్ ఆదేశించారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయా గ్రామాల వీఆర్వోలతో గురువారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. వీఆర్వోలు గ్రామాల్లో అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. వీఆర్వోల పనితీరుపై ఫిర్యాదులు అందితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఐ వరప్రసాద్ బాధ్యతల స్వీకారం

ఇబ్రహీంపట్నం: మండలం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా జి.వరప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ నార్త్ మండల తహసీల్దార్ కార్యాలయం నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఆర్ఐగా విధులు నిర్వహించిన యు.గోపీ జి.కొండూరు మండల తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఆర్ఐ వరప్రసాద్‌కు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. బదిలీ అయిన గోపీకి వీడ్కోలు పలికారు.

మండల పరిషత్ ఏఓగా కమల విష్ణు

చాట్రాయి: మండల పరిషత్ ఏఓగా ఎం.కమల విష్ణు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండల పరిషత్ కార్యాలయం ఏఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఏఓను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ జగదీష్ తెలిపారు. రాజవరం, తునికిపాడు, పెనుగొలను, దుందిరాలపాడు, ఆర్లపాడు, మేడూరు, జింకలపాలెం, చల్లగుండ్లవారిపాలెం, రాజులపాలెం, చెన్నవరం, సత్యాలపాడు గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

మోత మోగిస్తున్న మద్యం ధరలు

మైలవరం: నేతి బీర కాయలో నేయి ఉండటం ఎంత నిజమో ఉచిత ఇసుకలో అంతే నిజం దాగుంది. అదే విధంగా ఇప్పడు మద్యం ధరల్లో కూడా కూటమి ప్రభుత్వం నిజాయితీ అంతే ఉంది. మద్యం ధరలు మోత మోగుతున్నాయి. తాను అధికారంలోకి వస్తే ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక ఇస్తానని చెప్పిన చంద్రబాబు మాటలో ఎంత నిజముందో మద్యం ధరలు తగ్గింపులో కూడా అంతే ఉందని మద్యం ప్రియులు విమర్శిస్తున్నారు. నియోజకవర్గంలోని మైలవరం మండలంలో 4, జి.కొండూరు మండలంలో 4, రెడ్డిగూడెం మండలంలో 2, ఇబ్రహీంపట్నం మండలంలో 3 మద్యం షాపులు లాటరీలో వచ్చాయి. మద్యం దుకాణాల్లో చీప్ లిక్కర్ క్వార్టర్ ధర రూ.99కే అందిస్తామన్న కూటమి ప్రభుత్వం ఆచరణలో మాత్రం తీసుకురాలేదు. చీప్ లిక్కర్ క్వార్టర్ ధర రూ.130గా ఉంది. దీనితో మద్యం ప్రియులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం క్వార్టర్ మద్యం బాటిల్ ధరలు చీప్ లిక్కర్ రూ.130, మెక్ డవెల్ విస్కీ రూ.180, మేన్షన్ హౌస్ రూ.220, రాయల్ స్టాగ్ రూ.230, బ్లెండర్ స్ప్రైడ్ రూ.230, ఓల్డ్‌మంక్ రూ.270, మేజిక్ మూమెంట్స్ రూ.230గా ఉన్నాయి. రూ. 99కే మద్యం బ్రాండ్‌లు మార్కెట్‌లోకి ఎప్పుడు వస్తాయనే విషయాన్ని ఎక్సైజ్ శాఖ స్పష్టత ఇవ్వాలని మద్యం ప్రియులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా అమ్మకు వందనం కన్నా ముందే నాన్నకు మందు అందుబాటులోకి రావడంతో మహిళలు విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

ప్రతి జీవానికి నట్టల నివారణ మందు వేయాలి

పశు సంవర్ధక శాఖ నూజివీడు డీడీ చంద్రశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న డీడీ డాక్టర్ కె.చంద్రశేఖర్

నూజివీడు: జీవాల్లో నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని పశు సంవర్ధక శాఖ నూజివీడు డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని పశుసంవర్ధక శాఖ డీడీ కార్యాలయంలో నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి మండలాల్లోని పశువైద్యాధికారులకు, ఫీల్డ్ స్టాఫ్‌కు గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

ఆయన మాట్లాడుతూ ప్రతి జీవానికీ నట్టల నివారణ మందును తాగించాలని చెప్పారు. పశు పోషకులందరూ కిసాన్ క్రెడిట్ కార్డులు తీసుకునేలా వారిని చైతన్యపరచాలన్నారు. ఈ కార్డులుంటే బ్యాంకర్లు పశుపోషణకు, పశువుల కొనుగోలుకు రుణాలు అందిస్తారని చెప్పారు. ఇటీవలి కాలంలో పెయ్య దూడలు పుట్టేలా రూపొందించిన సెమన్ అందుబాటులోకి వచ్చిందని, ఈ నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పించి వారి పశువులకు కృత్రిమ గర్భధారణ చేసేలా చూడాలని చెప్పారు. పశువులు, జీవాలు, కోళ్లకు వచ్చే సీజనల్ వ్యాధులపై పశు వైద్యాధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి సకాలంలో చికిత్సను అందించాలన్నారు. పొదుగు వాపు వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏడీ డాక్టర్ ఎస్. రమణారావు, పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మెప్మా బజార్ ఏర్పాటు


మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మెప్మా బజారు

నూజివీడు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం మెప్మా బజార్ (అర్బన్ మార్కెట్)ను ఏర్పాటు చేశారు. పట్టణంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకుని వ్యాపారాలు చేస్తున్న వారు, కుటీర పరిశ్రమల ద్వారా చేస్తున్న ఉత్పత్తులను ఈ మెప్మా బజార్‌లో ప్రదర్శించి విక్రయించారు. ఇందులో ఆహార, వస్త్ర, ఆభరణ, అల్లికల ఉత్పత్తులను ప్రదర్శించారు. మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట రామిరెడ్డి మెప్మా బజార్‌ను పరిశీలించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పేద వర్గాల మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి గాను వారి ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మెప్మా బజార్‌లను ప్రతి నెలా మూడో వారంలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రజలు మెప్మా బజార్‌కు విచ్చేసి వారికి అవసరమైన వాటిని తక్కువ ధరకే కొనుగోలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో మెప్మా ఇన్‌చార్జి సీఎంఎం లటికే నాగోజీ, ఆర్పీలు పాల్గొన్నారు.

కాలినడకన వీరాంజనేయస్వామి సన్నిధికి..



మేడూరు(గంపలగూడెం): హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో గురువారం గంపలగూడెం నుంచి మేడూరు వీరాంజనేయస్వామి సన్నిధికి భక్తులు కాలినడకన వెళ్లారు. గంపలగూడెం సీతారామచంద్ర స్వామి ఆలయం నుంచి వీరాంజనేయ స్వామి ఆలయం వరకు ఆరు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. 108 పర్యాయాలు పౌర్ణమి రోజు పాదయాత్రలో భాగంగా 16వ విడత పాదయాత్ర జరిపామని భక్తబృందం సభ్యులు వివరించారు. వీరాంజనేయ స్వామికి భక్తులు విశేష పూజలు జరిపారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత



ఆగిరిపల్లి: తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో దాతలు నెలిబండ్ల శైలజ, సువర్ణ, నవ నిర్మాణ గ్రూప్ డైరెక్టర్ వెంకట సాయినాథ్ అందజేసిన ఆర్థిక సహాయంతో విజయవాడకు చెందిన నలుగురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను గురువారం అందజేశారు. హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, ప్రముఖ సంఘ సేవకురాలు జ్యోతికుమారి, విజయవాడ కార్పొరేటర్ నెలిబండ్ల బాలస్వామి పాల్గొన్నారు.

ప్లేట్లు, వాటర్ బాటిల్స్ వితరణ



చిలుకూరు(ఇబ్రహీంపట్నం): ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు బెంగళూరుకు చెందిన అంజనీదేవి 170 భోజనం ప్లేట్లు, 170 వాటర్ బాటిళ్లను గురువారం చిలుకూరు సర్పంచి గొంది సురేష్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీ దొంతమాల నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


ఇబ్రహీంపట్నం ఎంపీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ తదితరులు


తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు


తిరువూరు శాఖా గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ పద్మావతి తదితరులులు

తిరువూరు: రామాయణం రాసిన వాల్మీకి మహర్షి పుణ్య పురుషుడని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి చైర్‌పర్సన్, వార్డు కౌన్సిలర్లు, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉత్తమ పురుషుడిగా వాల్మీకి తన జీవితకాలంలో పాప పుణ్యకార్యాలకు అతీతంగా ఉన్నారని శ్లాఘించారు. కమిషనర్ లోవరాజు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గత్తం నాగేశ్వరరావు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. తిరువూరు గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో వాల్మీకి జయంతి సందర్భంగా లైబ్రేరియన్ కొరివి పద్మావతి, పాఠకులు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- **మైలవరం:** మైలవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి రామాయణం విశిష్టతను కొనియాడారు. డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల మైలవరం కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ ఆది కావ్యం రామాయణం రచనా నేపథ్యం, అందులోని సుగుణాలను, మాతృ, పితృ భక్తిని, సోదర ప్రేమ సుగుణాలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ పురంశెట్టి రంగారావు మాట్లాడారు.
- **గంపలగూడెం:** పెనుగొలను శాఖా గ్రంథాలయంలో వాల్మీకి చిత్ర పటానికి ఎంఈఓ పీవీడీఎల్ నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి జె. శ్రీలత, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చెన్నయ్య, ఈఓపీఆర్డీ బాబూరావు, సూపరింటెండెంట్ సబిత, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వర్లు తదితరులు వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. మండలంలోని పలు పాఠశాలల్లో వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం నిర్వహించారు.
- **ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, ఎంపీడీఓ సునీతా శర్మ పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యం వైపు సమాజాన్ని నడిపించాలన్నదే వాల్మీకి ఆశయమని వారు కొనియాడారు. పలు గ్రామాల సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఎన్టీటీపీఎస్ ఏపీ జెన్‌కో శిక్షణ కేంద్రంలో చీఫ్ ఇంజినీర్ బొడ్డు శ్రీధర్, ఎస్ఈ కె.సుశీల, జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) శ్రీనివాసరావు వాల్మీకి చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించారు. పలువురు ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు

తిరువూరు: త్వరలో జరుగనున్న కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల్లో ఓటు హక్కు నమోదుకు తిరువూరు ఎన్జీవో హోంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తాలూకా యూనిట్ ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్ బాబు తెలిపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఈ ఓటుహక్కు పొందవచ్చని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో తిరువూరు అశోక్‌నగర్ జెడ్పీ బాలికోన్నత పాఠశాల సమీపంలోని ఎన్జీఓ హోంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ఇసుక ఇక్కట్లు తొలగించాలని వినతి

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇసుక విధానాన్ని అనుసరించి ఇంతవరకు తిరువూరు నియోజకవర్గానికి ఇసుక సరఫరా కాకపోవడంతో పనులు లేక భవన కార్మికులు అల్లాడుతున్నారని సీఐటీయూ మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు అన్నారు. ఇసుక ఇక్కట్లు తొలగించాలని కోరుతూ ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు గురువారం వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్యేని ఆయన నివాసంలో కలిసిన భవన కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల కనుగుణంగా ఇసుక సరఫరా చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని, సార్వత్రిక ఎన్నికల నాటి నుంచి నిర్మాణ పనులు లేక కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని కోరారు. భవన కార్మికుల సంఘం అధ్యక్షుడు నల్లగొర్ల వేలాద్రి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత



ఇబ్రహీంపట్నం: ఇటీవల వచ్చిన కృష్ణానది వరద బాధితులు 200 మందికి రామ్‌కో ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల కిట్లను గురువారం పంపిణీ చేశారు. రామ్‌కో కంపెనీ మేనేజర్ పి.ఆనందరావు, హెచ్ఆర్ మేనేజర్ టీజీ రామ్మోహన్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం



ఆగిరిపల్లి: మండలంలోని ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కేంద్ర బృందం సందర్శించింది. ఏపీహెచ్ఎస్ ఎస్సీ ఐవీఏ ఆడిట్ బృందం సభ్యురాలు జైత్ర ఆధ్వర్యంలో రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలనూ పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఆయా విభాగాల ద్వారా అందిస్తున్న సేవలను వైద్యులు వివరించారు. రికార్డులు తనిఖీ చేసి వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నరేంద్ర కృష్ణ, డాక్టర్ సాయిసుధ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి నట్టల నివారణ మందుల పంపిణీ

గంపలగూడెం: గొర్రెలు, మేకల్లో సీజనల్‌గా వచ్చే నట్టల వ్యాధి నివారణకు మండలంలో శుక్రవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు మందు ఉచితంగా పంపిణీ చేస్తామని పశు వైద్యాధికారి అభిలాష్ తెలిపారు. శుక్రవారం నెమలి, ఉమ్మడ దేవరపల్లి, గంపలగూడెం, ఊటుకూరులో ఈ మందు పంపిణీ చేస్తామని చెప్పారు. గొర్రెలు, మేకల కాపరులు తమ జీవాలను తీసుకువచ్చి వ్యాక్సిన్ వేయించాలన్నారు.

- **ఆర్థికసాయం**

వత్సవాయి : పెనుగంచిప్రోలుకు చెందిన యాదా గోపాలకృష్ణ ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో రెండు చేతులు, కాలు కోల్పోయాడు. అతని ఆర్థిక ఇబ్బందులను తెలుసుకున్న జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బొగ్గవరపు వెంకటరాజారావు కుమార్తె తొండపు ఝాన్సీ పొట్టి శ్రీరాములు సేవా ట్రస్టు ద్వారా పదివేల రూపాయలను ఆర్థికసాయంగా అందజేశారు. సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

20న వ్యవసాయ ఆవిష్కర్తలు, వలంటీర్ల సమావేశం

నూజివీడు: కొత్త వ్యవసాయ ఆవిష్కరణలపై చర్చించేందుకు వ్యవసాయ ఆవిష్కర్తలు, వలంటీర్ల సమావేశం ఈ నెల 20న ఏర్పాటు చేశామని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణ సుధా అకాడమీ ఫర్ ఆగ్రో కాలేజీ, సుస్థిర వ్యవసాయ కేంద్రం, పల్లె సృజన ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా కొండపర్వలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆవిష్కరణలను రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా ఎక్కువమంది రైతులకు ఎలా చేర్చాలనే అంశాన్ని ఈ సందర్భంగా చర్చిస్తామని వివరించారు.

భక్తిశ్రద్ధలతో బతుకమ్మ నిమజ్జనం



గంపలగూడెం: దసరా పండుగ సందర్భంగా గంపలగూడెంలో పలుచోట్ల నెలకొల్పి విశేష పూజలు అందుకున్న బతుకమ్మ ప్రతిమలను గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. 11 రోజుల కిందట నెలకొల్పిన బతుకమ్మకు ప్రతి రోజూ మహిళలు విశేష పూజలు చేశారు. వివిధ రకాల పూలతో తయారు చేసిన పేర్పులను మహిళలు చేబూని వెంట రాగా బతుకమ్మను గ్రామంలోని ప్రధాన వీధుల వెంట ఊరేగించారు. అనంతరం నల్ల చెరువులో నిమజ్జనం చేశారు.